
సాక్షి మెదక్

బుధవారం, 15, ఫిబ్రవరి, 2023



సిద్దిపేటలో సెంట్రల్ 'నర్సరీ'

సిద్దిపేట పట్టణ శివారులోని మర్పడ్గలో ప్రభుత్వ భూమిలో 50 ఎకరాల్లో నర్సరీ ఏర్పాటుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. 8లో



ఆ ఇద్దరు ఎక్కడ?

రామాయంపేట మండలం నార్సింగిలో అదృశ్యమైన యువతి, యువకుడికి చెప్పులు, బైక్‌ను మంగళవారం ఉదయం నార్సింగి చెరువు వద్ద పోలీసులు గుర్తించారు. 8లో



వ్యాయామంతో ఆరోగ్యం

వ్యాయామంతో ఆరోగ్యంగా ఉంటామని హెల్త్ సెక్రెటరీలు విజయ, స్వప్న అన్నారు. చిట్కుల్, ఫైజాబాద్ గ్రామాల్లో మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. 9లో

మెతుకు సీమకు జలదారులు

- జిల్లాలో 32 కిలోమీటర్ల మేర కాలువల నిర్మాణం
- నాలుగు మండలాల్లో మొదలైన పనులు
- 79 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్
- 72 చెరువులను నింపడమే లక్ష్యం
- పూర్తయితే 19,452 ఎకరాలకు సాగునీరు



చేగుంట మండలం రుక్మాపూర్‌లో కాళేశ్వరం కాలువ

మెదక్‌జోన్: మెతుకు సీమ మెదక్ జిల్లాకు కాళేశ్వరం జలాలు అందించేందుకు కాలువల పనులు కొనసాగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. కేవలం 30శాతం నిధులను విడుదల చేయడంతో పనులు నెమ్మదిగా సాగాయి. ఇటీవల మంత్రి హరీశ్‌రావు నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష జరిపి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏడాది చివరి నాటికి పనులు పూర్తిచేసి సాగునీరు అందించాలని సూచించారు. దీంతో అధికారులు కాలువల పనులను పరుగుపెట్టిస్తున్నారు. ఈ కాలువలు పూర్తయితే జిల్లాలో 19,452 ఎకరాల భూములు సస్యశ్యామలంగా మారనున్నాయి.

జిల్లా వ్యాప్తంగా..

- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం జల ఫలాలను ఉమ్మడి మెదక్ జిల్లాకు అందించేందుకు అవసరమైన కాలువల పనులు కొనసాగుతున్నాయి.
- 2018లో కాలువ పనులు మొదలు 2020 వరకు కరోనా, వర్షాల కారణంగా పనులు ఆలస్యమయ్యాయి.
- కాగా తాజాగా భూసేకరణ, రైతులకు పరిహారం చెల్లింపులను పూర్తిచేశారు. ప్రస్తుతం హల్దీ వాగు నుంచి ఇసుకతీత పనులు చేపట్టారు.
- కొండపోచమ్మ రిజర్వాయర్, రామాయంపేట మీదుగా మెదక్ జిల్లా చేగుంట, నార్సింగ్, వెల్దుర్తి తదితర మండలాల పరిధిలో ఈ కాలువల పనులు సాగుతున్నాయి.
- నాలుగు మండలాల పరిధిలో 40 పంచాయతీల్లో 76 చెరువులను నింపటంతో పాటు కాలువల ద్వారా డైరెక్ట్ పంపింగ్ చేయాల్సి ఉంటుంది.
- ఈ నాలుగు మండలాల్లో 32 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ తవ్వడంతో పాటు 79 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఏర్పాటు చేయనున్నారు.
- ఇందుకు సంబంధించి 648.17 ఎకరాల భూములను సేకరించారు. భూమి కోల్పోతున్న రైతులకు రూ.338.24 కోట్ల పరిహారం అందాల్సి ఉంది.
- కాగా పరిహారం కింద ఇప్పటి వరకు రైతులకు రూ.24 కోట్లు చెల్లించినట్లు సంబంధిత ఉన్నతాధికారి తెలిపారు.
- కాలువల తవ్వకానికి రూ.185.75 కోట్ల అంచనా వేయగా, రూ.55 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి.
- ఈ లెక్కన రూ.130.75 కోట్లు విడుదల కావాల్సి ఉంటుంది.

అన్నదాతలకు వరం

- మెదక్ జిల్లాలో చెప్పుకోదగ్గ సాగు నీటిప్రాజెక్టులు లేనందున కాళేశ్వరం కాలువల నుంచి వచ్చే సాగు నీటిపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.
- నియోజకవర్గంలోని రామాయంపేట, చిన్నశంకరంపేట, నార్సింగ్‌తో పాటు దుబ్బాక నియోజకవర్గంలోని చేగుంట, నర్సాపూర్ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలాల్లో కాలువల తవ్వకం సాగుతుంది.
- నాలుగు మండలాల్లో 32.255 కిలో మీటర్ల మేర ప్రధాన కాలువతో పాటు, 79 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూటరీ కాలువ తవ్వనున్నట్లు సంబంధిత ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.
- ఇవి కాకుండా పంటపొలాలకు వెళ్లే పిల్లకాలువలు సైతం 2–3 వందల కిలోమీటర్ల మేర తవ్వాల్సి ఉంటుంది.
- కాలువల పనులు పూర్తయితే సుమారు 19,452 ఎకరాల్లో బీడు పొలాలు సస్యశ్యామలం కానున్నాయి.
- అంతే కాకుండా 40 గ్రామాల పరిధిలో 76 చెరువుల్లో నీటిని నింపటం లక్ష్యంగా కాలువల నిర్మాణం చేపట్టారు. ఆయకట్టు భూములు ఏడాదికి రెండు పంటలు పండటంతో పాటు చెరువు పరిసరాల్లో 3కిలోమీటర్ల దూరం వరకు భూగర్భ జలాలు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.
- ఫలితంగా రైతులు ఏడాదికి రెండు పంటలు మూడు ఆరుతడి పంటలను సాగుచేసుకునే అవకాశం ఉంటుంది.

సంతోషంగా ఉంది



కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా సాగు నీరు అందించే పనులు కొనసాగుతున్నాయి. కాలువలు పూర్తయితే జిల్లాలో సుమారు 20 వేల ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుంది. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి రుణపడి ఉంటాం

– బందెల జ్యోతి, సర్పంచ్, జంగారాయి

ఏడాది చివరిలోగా పూర్తి



మెదక్ జిల్లాలో కాళేశ్వరం కాలువలు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 32.225 కిలో మీటర్లమేర ప్రధాన కాలువల నిర్మాణాలు కాగా 79 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూటరీ కాలువలు తవ్వుతున్నాము. ఏడాది చివరి లోపు జిల్లాకు 19,452 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

– ఏసయ్య, ఇరిగేషన్ ఎస్‌ఈ, మెదక్

ఏర్పాట్లు పూర్తి చేయాలి

కలెక్టర్ రాజర్షి షా



పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

పాపన్నపేట(మెదక్): ఈ నెల 17 లోపు ఏడుపాయల జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, రమేష్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డితో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయం వద్ద రోడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, చెక్ డ్యాం, ఘనపురం ఆనకట్టపై బారికేడ్లు తదితర పనులను పరిశీలించారు. 18 నుంచి ప్రారంభమయ్యే జాతరకు సుమారు 10 లక్షల మంది భక్తులు వస్తారని, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, స్నాన ఘట్టాల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

కోర్టు ప్రాంగణంలో నేత్ర పరీక్షలు

మెదక్ కలెక్టరేట్: మెదక్‌లోని జిల్లా కోర్టు సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, జిల్లా వైద్యాధికారి చందునాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఐ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో సీనియర్ సివిల్ జడ్జి జితెందర్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రీటాలాల్‌చంద్, స్పెషల్ మొబైల్‌కోర్టు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.కల్పన, డాక్టర్ నవీన్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారు.

న్యూస్‌రీల్

రేపు మహిళలకు చెస్ పోటీలు

మెదక్ కలెక్టరేట్: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 16న జిల్లాలో మహిళలకు చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు మంగళవారం తెలిపారు. మొదటి రెండు స్థానాల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 17న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గల మహిళా క్రీడాకారులు బుధవారం సాయంత్రం 5గంటల్లోగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9849263246, 9493594388 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అధికారికంగా సేవాలాల్ జయంతి

మెదక్ కలెక్టరేట్: సంత్ సేవాలాల్ 284వ జయంతిని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో బుధవారం అధికారికంగా నిర్వహిస్తామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఉదయం 10గంటలకు సభ, అనంతరం ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బంజారాలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏడుపాయల ఆలయ హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆలయ హుండీని మంగళవారం లెక్కించగా రూ.20,45,746 ఆదాయం వచ్చినట్లు ఆలయ పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్ తెలిపారు. 26 రోజుల అనంతరం రాజరాజేశ్వరి సేవా సమితి మహిళలు హుండీ లెక్కించారు. నగదుతో పాటు, మిశ్రమ వెండి, బంగారు కానుకలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చాకరిమెట్లలో విప్ ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దంపతులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామిని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శాసన మండలి విప్‌గా ప్రభుత్వం నియమించినందుకు గాను స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించినట్లు ఎమ్మెల్సీ రాజు తెలిపారు. ఆయనతో మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి హన్మంత్‌రావ్, ఈఓ సార శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను అడ్డుకోవడం సరికాదు

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి



మాట్లాడుతున్న నందారెడ్డి

నిజాంపేట(మెదక్): సీఎం కేసీఆర్ స్వ లాభం కోసం కేంద్ర పథకాలను అడ్డుకుంటున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి ఆరోపించారు. మంగళవారం మండలంలోని నార్లాపూర్ గ్రామంలో జరిగిన బీజేపీ కార్నర్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కేంద్రం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటివెళ్లి కార్యకర్తలు వివరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ నవాత్ రాజేంద్రప్రసాద్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు ఆకుల రమేశ్, నరేశ్, గోపరిబ వెంకట్, ధర్మారెడ్డి, పరశురాం, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి



డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

కలెక్టర్ రాజర్షి షా

మెదక్‌జోన్: జిల్లాలో ప్రగతిలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. మంగళవారం అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, రమేష్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డితో మెదక్ పట్టణం పిల్లికొట్టాల్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ పట్టణంలో 1,072 ఇండ్ల నిర్మాణం చేపట్టగా ఇంతవరకు 561 గృహాలు మాత్రమే పూర్తి అయ్యాయని, చివరి దశలో ఉన్న మరో 404 గృహాల పనులను నెలాఖరుకు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా చేయాలన్నారు. జర్నలిస్టు ఇళ్ల మధ్య నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు పూర్తి చేసి, రోడ్డును చదును, విద్యుత్ సౌకర్యం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. రామాయంపేటలో 304 ఇండ్లు, నిజాంపేట మండలం కల్వకుంట్ల, చెల్మెడ, నందిగామలో 152 ఇళ్లను, పాపన్నపేట మండలం బాచారంలో 72 ఇళ్ల పనులను మార్చి నాటికి పూర్తి చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని ఆదేశాలిచ్చారు. ఆయనతో పంచాయత్ రాజ్ ఈఈ సత్యనారాయణ రెడ్డి, డిప్యూటీ ఈఈ పాండురంగా రావు, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

నర్సాపూర్: పట్టణ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్తు కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ వార్డులు, లేబొరేటరీ, మహిళల వార్డుల్లో పరిశీలించి, రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేసి, సూపరింటెండెంట్ డాక్టర్ మీర్జా నజీంబేగ్, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రిలో నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆయనతో ఆయా విభాగాల వైద్యులు నవీన్, గురుకృష్ణ, ఇలియాస్ ఉన్నారు.



తనిఖీ చేస్తున్న డాక్టర్ అజయ్‌కుమార్

మిల్లర్లు రైతులకు సహకరించాలి

జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్



రైస్‌మిల్లును ప్రారంభిస్తున్న శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): రైస్‌మిల్లర్లు రైతుల సహకరించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ అన్నారు. చేగుంట మండలం మక్కరాజీపేటలో లక్ష్మీబాలాజీ ఆగ్రో రైస్‌మిల్లును మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఆధారిత పంటలు సాగవుతాయని, డిమాండ్‌కు అనుగుణంగా రైస్ మిల్లర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అధునాతన యంత్రాలతో జిల్లాలో మరిన్ని రైస్ మిల్లులు ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్ నిర్వాహకులు రాఘవ, కిరణ్, నర్సింలు సిద్దిరాములుతో పాటు వివిధ మండలాలకు చెందిన రైస్‌మిల్లుల సోసియేషన్ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

హామీలను మరిచిన కేసీఆర్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్



మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్

మెదక్‌జోన్: ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ మరిచారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి నందా రెడ్డి ఆరోపించారు. ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 148, 149, 155 బూత్‌లతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, ప్రతీ ఎకరాకు సాగునీరు అంటూ మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించారని విమర్శించారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ ఎక్కల దేవి మధు సూదన్, శక్తికేంద్ర ఇన్‌చార్జ్ బక్కవారి శివ, సహ ఇన్‌చార్జ్ వరప్రసాద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సంగీత తదితరులు పాల్గొన్నారు.

తెగులు నివారణతో అధిక దిగుబడి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆశాకుమారి



మాట్లాడుతున్న ఆశాకుమారి

మెదక్‌జోన్: వరి పంటలో సోకె మొగిపురుగు, అగ్గి తెగులు నివారిస్తే అధిక దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఆశాకుమారి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పంటలో మొగి పురుగు నివారణకు సస్యరణక్షణ చర్యలు చేపట్టాన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కర్టాఫ్ హైడ్రోక్లోరైడ్ మందును 400 గ్రాములు ఎకరానికి, క్లోరాంట్రిని పోల్ 60 మిల్లీ లీటర్లు కలిపి ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అగ్గి తెగులు నివారణకు ఐసోప్రోతయోలిన్ 320 మిల్లీ లీటర్లు ఎకరాకు, ట్రైసైక్లోజన్ 120 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల చొప్పున నీటిలో కలిపి మొక్కలకు పిచికారీ చేయాలని వివరించారు. ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శేఖర్, పట్టణ రైతులు అంజయ్య, శ్రీధర్, రాములు, చంద్రశేఖర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేయమంటే అవిశ్వాసం పెట్టారు

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్



నర్సాపూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరితే... తనపైనే అవిశ్వాసం పెట్టారని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నాయకుడు మురళీయాదవ్ ఆరోపించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. అధికార పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి వెళ్లరంటే సీఎం పరిపాలన ఎలా ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు. మున్సిపాలిటీల్లో వసతుల కల్పనపై సభ్యులు ఆలోచించాలని, అవిశ్వాసానికి భయపడేది లేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌కు దమ్ముంటె మున్సిపాలిటీలను రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, ఆర్‌డీఓ, ఎక్సైజ్ శాఖ తదితర శాఖల కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రాజీనామా చేయాలని, ఉపఎన్నిక వస్తే నర్సాపూర్ అభివృద్ధి చెందుతుందని అన్నారు. మూడు సార్లు ఓటమి చెందిన సునీతారెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీలోకి తీసుకుని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవిని అంటగట్టారని, ఓటమి చెందిన సునీతారెడ్డికి పెద్ద పదవిని ఇచ్చినా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కిమ్మనకుండా ఊరుకోవడం విచారకరమని అన్నారు.

వైభవంగా బోనాల ఊరేగింపు



పోతరాజుల నృత్యాలు



బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: శివ సత్తుల శిగాలు..పోతారాజుల గావుకేకలు.. డప్పు చప్పులు.. యువకుల నృత్యాలతో మెదక్ పట్టణంలో పసుపు లేరు ఒడ్డున రేణుకా ఎల్లమ్మ బోనాల ఊరేగింపు మంగళవారం అంగరంగ వైభవం జరిగింది. పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో 29వ వార్షికోత్సవం సందర్భంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని నవాపేట్, పిట్లంబేస్, పెద్దబజార్, ఫతేనగర్, దాయర, కొలిగడ్డ, ఆయా ప్రాంతాల్లోని గౌడ సంఘం సంఘం సభ్యులు వేడుకలను నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకుని ముందుకు సాగగా, డీజే పాటల చప్పుళ్ల నడుమ యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ టమలత, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీశేరి సుభాష్ రెడ్డి అమ్మవారి దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేందర్ గౌడ్, గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు కృష్ణ గౌడ్, సభ్యులు మల్లికార్జున్ గౌడ్, మంగ అశోక్ గౌడ్, ముత్యంగౌడ్, నర్వ లక్ష్మి నారాయణ గౌడ్, మంగ శ్రవణ్ గౌడ్, వెంకట్ గౌడ్, రవి గౌడ్, మడూరి నాగరాజ్ గౌడ్, మాదురి కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో పటాన్‌చెరు నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 34 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి(33మంది) రూ.2000 జరిమానా, మరొకరికి రూ.3000 జరిమానా విధించారు.

సిద్దిపేటలో...

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి మంగళవారం జరిమానా విధించారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్‌ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్‌ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వాహనదారులను బ్రీత్‌ ఎనలైజర్‌తో పరీక్షించగా 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేష్‌బాబు వారికి రూ.24వేల జరిమానా విధించారు.

ముగ్గురు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు పరిధిలో వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. అయితే డిగ్రీ విద్యార్థినిని తీసుకెళ్లిన వ్యక్తిని అరెస్ట్‌ చేసి, ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.

చిప్స్‌ కొనడానికి వెళ్లి...

పటాన్‌చెరు ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న బాలిక(14) సోమవారం మధ్యాహ్నం తినడానికి చిప్స్‌ కొంటానని అమ్మమ్మకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో కంగారు పడిన ఆమె తన కూతురుకు జరిగిన విషయంచెప్పింది. మంగళవారం ఉదయం వరకూ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిగ్రీ విద్యార్థినిని తీసుకెళ్లిన వ్యక్తి అరెస్ట్‌

ఎస్‌ఐ రామనాయుడు కథనం ప్రకారం...పటాన్‌చెరు పట్టణంలోని ఓ కాలనీకి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని(17) సోమవారం కాలేజీకని ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన కూతురు అదృశ్యమైందని, తండ్రి మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ విద్యార్థిని కుటుంబసభ్యులకు అప్పగించి, తీసుకెళ్లిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

స్కూల్‌కని చెప్పి...

టీచర్‌ అదృశ్యమైన సంఘటన బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది.


మధులత (ఫైల్‌)

ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం..రామచంద్రపురం పరిధిలోని నాగులపల్లికి చెందిన మధులత వెలమెలలో ఓ ప్రైవేట్‌ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. సోమవారం స్కూల్‌కని ఇంటి నుంచి వెళ్లింది. అయితే స్కూల్‌కు ఆమె రాకపోవడంతో ప్రిన్సిపల్‌ మధులత భర్త గోపాల్‌కు ఫోన్‌ చేశాడు. దీంతో గోపాల్‌ తన భార్యకు ఫోన్‌ చేయగా, స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. భార్య గురించి తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం సాయంత్రం బీడీఎల్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సిద్దిపేటలో సెంట్రల్‌ ‘నర్సరీ’

- మర్పడ్గలో 50 ఎకరాల్లో ఏర్పాటు
- హరితనిధి నుంచి రూ.5.85 కోట్లు మంజూరు

సాక్షి, సిద్దిపేట: పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసిందే. 2016లో ప్రతిష్టాత్మకంగా తెలంగాణకు ‘హరితహారం’ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా పల్లె, పట్టణాలన్నీ హరితమయం అయ్యాయి. పల్లె ప్రకృతి వనం, బృహత్‌ ప్రకృతి వనం, అర్బన్‌ పార్కు, అవెన్యూ ప్లాంటేషన్‌ ఏర్పాటుతో ఎక్కడ చూసినా పచ్చదనం వెల్లివిరుస్తోంది. సిద్దిపేట పట్టణ శివారులోని మార్పడ్గలో ఐదెకరాల విస్తీర్ణంలో తేజోవనం పార్కు ఉంది. ఇక్కడే నర్సరీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రభుత్వభూమి కూడా ఉంది. దీంతో 50 ఎకరాల్లో నర్సరీ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

- 50 ఎకరాల విస్తీర్ణంలో 50 లక్షలకు పైగా మొక్కలు పెంచేందుకు అనువైన స్థలం ఉందని మంత్రి హరీశ్‌రావు చొరవతో అధికారులు నర్సరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు.
- హరితనిధిలో భాగంగా సిద్దిపేటజిల్లాకు అటవీశాఖ సెంట్రల్‌ నర్సరీ మంజూరైంది. మూడేళ్లకు గాను రూ5.85 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో 2022–2023కు రూ1.51 కోట్లు, 2023–2024కు రూ1.18కోట్లు, 2024–2025కు రూ 3.14కోట్లు ప్రభుత్వం అందించనుంది
- తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచే పద్ధతులను ఈ నర్సరీలో అవలంబించనున్నారు.
- ట్రేలల్లో గింజలు నాటి మొలకెత్తిన తర్వాత బ్యాగుల్లోకి మారుస్తారు. మీటరున్నర నుంచి 3 మీటర్ల ఎత్తు వరకు ఉండే మొక్కలను పెంచేందుకే ఇక్కడ నర్సరీ ఏర్పాటు చేస్తున్నారు.
- గ్రీన్‌ పాలిహౌస్‌లు, షెడ్లు నిర్మించి పెద్ద మొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలు ఇక్కడే పెంచేందుకు ప్రణాళిక రూపొందించారు.


మర్పడ్గలోని తేజోవనం ఇదే..

ఇక్కడి నుంచే అరుదైన మొక్కలు సరఫరా



అరుదైన మొక్కలను గతంలో ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించే వాళ్లం. త్వరలో సిద్దిపేటలో అరుదైన మొక్కలు పెంచుతాం. ఇక ఇక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు మొక్కలను సరఫరా చేస్తాం. మంత్రి హరీశ్‌రావు చొరవతో జిల్లాకు అటవీశాఖ సెంట్రల్‌ నర్సరీ మంజూరైంది. ఏటా 50 లక్షలకు పైగా మొక్కలు పెంచాలన్న లక్ష్యంగా నర్సరీ ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

–శ్రీనివాస్‌, డీఎఫ్‌ఓ

బియ్యం లారీలో మంటలు


శివ్వంపేట వద్ద మంటల్లో కాలిపోతున్న లారీ

జోగిపేట(అందోల్‌): చౌటకూర్‌ మండలం శివ్వంపేట శివారులో మంగళవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో బియ్యం లోడ్‌తో వెళుతున్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో లారీలో ఉన్న రూ.పదిలక్షల విలువ చేసే బియ్యం బూడిదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. బియ్యంలోడ్‌తో ఉన్న లారీ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నుంచి నాందేడ్‌కు బయలుదేరింది. 161వ జాతీయ రహదారిపై శివ్వంపేట మీదుగా వెళుతుండగా, లారీ వెనుక భాగంలో ఎడమవైపున ఉన్న టైర్‌ బాగా వేడెక్కి మంట అంటుకుంది. ఆ మంట లారీ బాడీకి వ్యాపించాయి. దీంతో లారీలో ఉన్న 25 టన్నుల బియ్యంలో సగానికిపైగా కాలిబూడిదైంది. ఫైర్‌ ఇంజిన్‌ సాయంతో మంటలను ఆర్పేశారు. అయితే సాయంత్రం వరకు లారీకి సంబంధించిన వ్యక్తులెవరూ రాలేదని పుల్కల్‌ ఎస్‌ఐ గణేష్‌ ‘సాక్షి’కి తెలిపారు. ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, లారీ దూర ప్రాంతం నుంచి రావడంతో టైర్లు వేడెక్కాయి. టైర్‌కు మంటలు వచ్చిన విషయాన్ని డ్రైవర్‌ సకాలంలో గుర్తించని కారణంగా భారీగా నష్టం జరిగింది. అయితే లారీ యజమాని వచ్చేవరకు నష్టం వివరాలు చెప్పలేమని ఎస్‌ఐ తెలిపారు.

రాజగోపురం వద్ద యాచకుడి మృతి


వరదయ్య మృతదేహం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాల్లో తిరిగే యాచకుడు వరదయ్య(64) మంగళవారం రాజగోపురం వద్ద మరణించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనస్థలికి చేరుకొని హైదరాబాద్‌లో ఉంటున్న మృతుడి కుటుంససభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. రాజగోపురం వద్ద మృతి చెందండంతో ఆలయాన్ని మూసివేశారు. సాయంత్రం సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

బ్యాంకుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి


ఆర్‌బీఐ పోస్టర్‌ ఆవిష్కరణలో సీపీ శ్వేత, పోలీసులు, బ్యాంక్‌ అధికారులు

బ్యాంక్‌ అధికారుల సమావేశంలో సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్‌: భద్రత దృష్ట్యా ప్రతి బ్యాంకు లోపల, బ్యాంకు ముందు సీసీ కెమెరాలు తప్పనిసరిగా బిగించాలని సిద్దిపేట పోలీసు కమిషనర్‌ ఎన్‌. శ్వేత బ్యాంకు అధికారులకు సూచించారు. మంగళవారం కమిషనర్‌ కార్యాలయంలో సీసీ కెమెరాలు, సైబర్‌ క్రైమ్స్‌, ట్రైనింగ్స్‌పై బ్యాంక్‌ అధికారులతో సీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ ఎక్కువ నేరాలు బ్యాంకు పరిసరాల్లోనే జరుగుతున్నందున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత కాలంలో జరుగుతున్న సంఘటనల దృష్ట్యా సీసీ కెమెరాల ప్రాధాన్యం, కమిషనరేట్‌ పరిధిలో జరిగిన దొంగతనాలను సీసీ కెమెరాల సాయంతో చేధించిన విధానాన్ని సీపీ వారికి వివరించారు. ఎస్‌బీఐ రీజినల్‌ మేనేజర్‌ నీరజ మాట్లాడుతూ సీసీ కెమెరాలకోసం తమ ఉద్యోగుల నుంచి సామాజిక బాధ్యతగా కొంత మొత్తంలో నిధులు సేకరిస్తామన్నారు. లీడ్‌బ్యాంక్‌ డిస్ట్రిక్ట్‌ మేనేజర్‌ సత్యజిత్‌ మాట్లాడుతూ సైబర్‌ క్రైమ్‌ జరిగినప్పుడు పోలీసులకు కావాల్సిన సమాచారం చెప్పి, బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి వారి ఖాతాల్లో చేరేలా చూస్తామన్నారు. రూరల్‌ సెల్ఫ్‌ ఎంప్లాయిమెంట్‌ ట్రైనింగ్‌ ఇనిస్టిట్యూట్‌ డైరెక్టర్‌ రాజలింగం మాట్లాడుతూ నిరుద్యోగ యువకులకు పోలీస్‌శాఖ సమన్వయంతో సీసీటీవీ మెయింటెనెన్స్‌ అండ్‌ రిపేర్‌పై 13 రోజుల శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఆర్‌బీఐ రూపొందించిన బ్యాంకుకు సంబంధించిన సమాచార పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో అడిషనల్‌ డీసీపీ అడ్మిన్‌ మహేందర్‌, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, గజ్వేల్‌ ఏసీపీ రమేష్‌ పాల్గొన్నారు.

ఆ ఇద్దరు ఎక్కడ?

- వివాహితను యువకుడు బైక్‌పై తీసుకెళ్లినట్టు సీసీ ఫుటేజీ !
- చెరువువద్ద బైక్‌, ఇద్దరి చెప్పులు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నార్సింగిలో వీడని మిస్టరీ


చెరువు వద్ద గుమికూడిన జనం


చెరువు వద్ద వదిలి వెళ్లిన బైక్‌, చెప్పులు

రామాయంపేట(మెదక్‌): నార్సింగిలో ఇద్దరి అదృశ్యం మిస్టరీగా మారింది. మండల కేంద్రానికి చెందిన వివాహిత, మరో యువకుడు ఒకే బైక్‌పై సోమవారం రామాయంపేటలో కలిసి తిరిగినట్టు సీసీ కెమెరాలో రికార్డు అయినట్టు తెలిసింది. అయితే ఆ బైక్‌ , ఇద్దరి చెప్పులు మంగళవారం ఉదయం నార్సింగి చెరువు వద్ద లభ్యమయ్యాయి. కూతురు కనిపించడం లేదని ఆమె తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్‌ కేసు నమోదైంది. సదరు యువతికి మూడు నెలల క్రితం వివాహం జరిగింది. శివరాత్రి పండగ నిమిత్తం ఈనెల తొమ్మిదివ తేదీన ఆమెను అత్తగారింటినుంచి నార్సింగి తీసుకొచ్చారు. చెరువు వద్ద బైక్‌, చెప్పులు లభించడంతో ఇద్దరూ ఆత్మహత్య చేసుకొని ఉంటారని ముందుగా అందరూ అనుమానించారు. విషయం తెలియగానే గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు. పోలీసులు గజ ఈతగాళ్లు, వలలతో చెరువులో గాలించినా ఇద్దరి ఆచూకీ లభించలేదు. అయితే అందరి దృష్టిని మళ్లించడానికే బైక్‌, చెప్పులు చెరువు వద్ద విడిచి వెళ్లినట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా మిస్టరీగా మారిన ఈకేసును త్వరలోనే చేధిస్తామని నార్సింగి ఎస్‌ఐ నర్సింలు పేర్కొన్నారు.

రెగ్జిన్‌ షాప్‌లో చోరీ

చేర్యాల (సిద్దిపేట): రెగ్జిన్‌ షాప్‌లో చోరీ జరిగింది. ఈ సంఘటన మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మండల పరిధిలోని మాసిరెడ్డి పల్లికి చెందిన ఘనపురం ప్రసాద్‌ పట్టణ కేంద్రంలో ఉంటూ రెగ్జిన్‌షాప్‌ నిర్వహిస్తున్నాడు రోజువారి లాగానే సోమవారం రాత్రి షాప్‌నకు తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా షాప్‌ తాళం పగలగొట్టి ఉంది. దీంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని క్లూస్‌ టీం సాయంతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. లక్ష రూపాయల నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారని బాధితులు వాపోయాడు.

పెట్రోల్‌ బంక్‌లో దొంగతనం


కార్యాలయ తలుపులు తొలగించిన దృశ్యం

నారాయణఖేడ్‌: సిబ్బంది నిద్రిస్తున్న వేళ..పెట్రోల్‌ కోసం వచ్చినవారు చోరీకి పాల్పడ్డారు. బంక్‌ నిర్వాహకుడు ప్రభాకర్‌ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం..నారాయణఖేడ్‌- నిజాంపేట్‌ జాతీయ రహదారిపై ఖేడ్‌ శివారులో మహాలక్ష్మి పెట్రోల్‌బంక్‌ ఉంది. ఇంధనం కోసం కొందరు వచ్చారు. తెల్లవారుజామున సిబ్బంది నిద్రిస్తున్న విషయాన్ని గుర్తించి కార్యాలయ తలుపులు బద్దలు కొట్టి టార్చ్‌లైట్‌ సహకారంతో మూడు సెల్‌ ఫోన్లు, నగదు ఉన్న బ్యాగును అపహరించారు. ఉదయం లేచాక సిబ్బంది తలుపులు తొలగించి ఉన్న విషయాన్ని గుర్తించి నిర్వాహకుడికి సమాచారం ఇచ్చారు. చోరీ ఘటన సీసీ పుటేజీలో రికార్డు అయ్యిందని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ప్రభాకర్‌ తెలిపారు.

మూడిళ్లలో చోరీ

కొమురవెల్లి(సిద్దిపేట): ఒకే రోజు మూడు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని గౌరయపల్లిలో సోమవారం రాత్రి జరిగింది.

- గ్రామానికి చెందిన నీల కనకయ్య కొమురవెల్లి జాతరలో హోటల్‌ నిర్వహించేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చిచూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి 70 తులాల వెండి, 25 గ్రాముల బంగారం చోరీకి గురైంది.
- తాడూరు బాలయ్య ఇంటికి కొడుకు ఇంటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి 50 తులాల వెండి, రూ.20 వేలనగదు ఎత్తుకెళ్లారు.
- కర్ణాకర్‌రెడ్డికి చెందిన ద్విచక్రవాహనం కూడా ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి

సిద్దిపేట జిల్లాలో వేర్వేరు ఘటనల్లో గాయపడిన ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు.


జంగం ఎల్లయ్య (ఫైల్‌)

మిరుదొడ్డి(దుబ్బాక): భూంపల్లి ఏఎస్‌ఐ రవీందర్‌ తెలిపిన కథనం ప్రకారం..మోతె గ్రామానికి చెందిన జంగం ఎల్లయ్య (45) మరో ఇద్దరితో కలిసి సోమవారం రాత్రి బైక్‌పై దుబ్బాకకు బయలుదేరాడు. మోతె శివారులోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీ లైట్ల ఫోకస్‌తో ఎల్లయ్య కళ్లకు ఒక్కసారిగా బైర్లు కమ్ముకున్నాయి. దీంతో బైక్‌ అదుపు తప్పింది. రోడ్డు పక్కనున్న మర్రిచెట్టు ఊడలకు తగిలి ఎల్లయ్యతో పాటు ఆ ఇద్దరూ కూడా కిందపడి గాయాలయ్యాయి. 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎల్లయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిపల్లి సమీపంలో...


కనకరాజు(ఫైల్‌)

గజ్వేల్‌రూరల్‌: రాయపోల్‌ మండలం వీరానగర్‌కు చెందిన లక్కుమల్ల కనకరాజు (20) భవన నిర్మాణ కార్మికుడిగా, అదే గ్రామానికి చెందిన సిందం చంద్రం కూడా గజ్వేల్‌లో పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి పని ముగిసిన తర్వాత కనకరాజు ద్విచక్ర వాహనంపై వీరానగర్‌కు బయలుదేరగా, చంద్రం సైకిల్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో గజ్వేల్‌ మండలం గిరిపల్లి సమీపంలో సైకిల్‌పై ముందుగా వెళుతున్న చంద్రంను ఢీకొని కనకరాజు కిందపడిపోయాడు. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కనకరాజుకు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శంకర్‌ కుటుంబానికి ఠాక్రే పరామర్శ


శంకర్‌ తల్లితో మాట్లాడుతున్న మాణిక్‌రావుఠాక్రే

పటాన్‌చెరు: టీ పీసీసీ సోషల్‌ మీడియా కోఆర్డినేటర్‌ సింధు శంకర్‌ ఇటీవల గుండెపోటుతో మరణించగా, ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌ మాణిక్‌రావు ఠాక్రే పరామర్శించారు. శంకర్‌ కుటుంబం అమీన్‌పూర్‌ మండల పరిధిలోని పటేల్‌గూడలోని సూర్యోదయ కాలనీలో నివసిస్తోంది. మాణిక్‌రావు ఠాక్రే మంగళవారం రాత్రి శంకర్‌ ఇంటికి వచ్చారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. చిత్రపటం వద్ద నివాళులు అర్పించి శంకర్‌ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఠాక్రే వెంట ఏఐసీసీ కార్యదర్శి బోస్‌రాజ్‌, నదీమ్‌ జావీద్‌, జిల్లా కాంగ్రెస్‌ నేతలు కాట శ్రీనివాస్‌గౌడ్‌, గాలి అనిల్‌కుమార్‌, వడ్డె జైపాల్‌ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


నరేశ్‌ (ఫైల్‌)

మెదక్‌ రూరల్‌: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన హవేళిఘణాపూర్‌ మండలం బూరుగుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గడ్డం నరేశ్‌ (28) రాత్రి ఏడు గంటల సమయంలో కరెంట్‌ సరఫరాలో అంతరాయం వచ్చిందని, విద్యుత్‌ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తున్నాడు. ఈ క్రమంలో షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆయిల్‌పామ్‌ సాగుపై అవగాహన

సిద్దిపేటరూరల్‌: నారాయణరావుపేట మండలంలోని గోపులాపూర్‌లో ఆయిల్‌పామ్‌ సాగుపై ఆయిల్‌ఫెడ్‌ జిల్లా కోఆర్డినేటర్‌ శంకర్‌, ఏఓ రమణిలు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ , రైతుబంధు సమితి మండల కన్వీనర్‌ బాల్‌రెడ్డి, హార్టికల్చర్‌ ఆఫీసర్‌ భాస్కర్‌, ఏఈఓలు నాగార్జున, సంధ్య, ఉపసర్పంచ్‌ సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర దాడులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఒకరిపై మరొకరు దాడి చేసుకొని పోలీసులను ఆశ్రయించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలో అక్బర్‌ మాంసం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. కాగా రఫీ అక్కడకు వెళ్లాడు. ఇద్దరూ ఘర్షణ పడ్డారు. రఫీకి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రఫీని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా గతంలో రఫీ అక్బర్‌ ఇంట్లో అద్దెకు ఉండేవాడని పోలీసులు తెలిపారు. జరిగిన ఘటనపై ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రారంభోత్సవం

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని కేసీఆర్‌ డబుల్‌ బెడ్‌రూం కాలనీలో మహాత్మాజ్యోతిరావుపూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాలను మంత్రి హరీశ్‌రావు బుధవారం ప్రారంభించనున్నారు. ఇప్పటికే సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటికే రెండు ఎంజేపీలు అందుబాటులోకి వచ్చాయి.

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

వేర్వేరు చోట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు.

భార్యకు దూరమై...

కోహీర్‌(జహీరాబాద్‌): భార్యకు దూరమై..తాగుడుకు బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కోహీర్‌ ఎస్‌ఐ సురేష్‌ తెలిపిన వివరాల ప్రకారం ..మండల పరిధిలోని మనియార్‌పల్లికి చెందిన జయరాజ్‌(34)కు 2013లో మర్పల్లి మండలం నర్సాపూర్‌ గ్రామానికి చెందిన నవనీతతో వివాహం జరిగింది. పెళ్లి జరిగి తొమిదేళ్లయినా సంతానం లేదు. కుటుంబ కలహాల కారణంగా ఆరు నెలలుగా భార్య పుట్టినింటిలో ఉంటోంది. దీంతో జయరాజ్‌ భార్యకు దూరమై తాగుడుకు బానిసయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలంపనికి వెళ్లిన తల్లి ఇంటికి వచ్చేసరికి కొడుకు మృతదేహం దూలానికి వేలాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగుడుకు బానిసై...

వర్గల్‌(గజ్వేల్‌): మద్యానికి బానిస అయ్యి జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని వేలూరుకు చెందిన బగ్గి చంద్రయ్య(62)కు ఇద్దరు భార్యలు, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరి వివాహాలు జరిగాయి. కరోనా సమయంలో మొదటి భార్య చనిపోయింది. కొడుకు ఇంటినుంచి వెళ్లిపోయి గజ్వేల్‌లో ఉంటున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసైన చంద్రయ్య తరచు రెండో భార్యతో గొడవపడేవాడు. దీంతో ఆమె కూడా విసిగి వెళ్లిపోయింది. నాటి నుంచి ఇంట్లో చంద్రయ్య ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తాను చనిపోతానంటూ రెండో కూతురుకు ఫోన్‌ చేశాడు. ఇంట్లోనే ఫ్యాన్‌ కొండికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవ పడి..

పటాన్‌చెరు టౌన్‌: భార్యతో గొడవపడిన ఓ భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్‌ మొహ్మద్‌ అలీ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ప్రశాంత్‌(27) ఓ ప్రైవేట్‌ కంపెనీలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై తరచు ఇంట్లో గొడవపడేవాడు. సోమవారం రాత్రి కూడా మద్యం సేవించాక ఇంటికి వచ్చి భార్య, కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. కుటుంబసభ్యులు తలుపులు తీసి చూసేసరికి సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని కనిపించాడు. గమనించిన వారు వెంటనే ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరులోని ఓ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి గోవర్ధన్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ భరించలేక..


సంపత్‌ కుమార్‌ (ఫైల్‌)

నర్సాపూర్‌ రూరల్‌: అప్పుల బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని చిన్నచింత కుంటకు చెందిన సంపత్‌కుమార్‌(38) ప్రైవేట్‌ వ్యాపారుల వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబపోషణ, పిల్లల చదువులు, ఇతర అవసరాలకు చేసిన అప్పులు పెరిగాయి. వాటిని తీర్చేదారి కనిపించక మంగళవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.